అది సహజం. అనేక కోట్ల శరీరాలు ఈ భూమి మీదకు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. కాని కోరికలు నెరవేర్చుకొంటూ, కోరికలు నెరవేర్చుకొంటూ కోరికలు లేని స్థితిని పొందినవాడు ఇంతవరకు సృష్టిలో ఒక్కడూ లేడు అని పరమాత్మ చెప్పాడు. గౌరవాలు అగౌరవాలు, సుఖ దుఃఖాలు, చావులు పుట్టుకలు, లాభనష్టాలు ఇవన్నీ ద్వైతాలు. వాటిని సహించటం నేర్చుకొంటాము అనుకోండి, ఈ ద్వైతాల మధ్యన ఉండి అద్వైతస్థితిలోనికి వెళ్ళిపోతాము. గురువుకు అంతా సాధ్యమే. గురువు ఈ మధ్య మనకు కనబడటంలేదు, మనకు ఏమీ చేయటం లేదు అని ఒకోసారి గురువును తిడుతూ ఉంటాము. ఇన్ని గొడవల మధ్యన కూడా గురువు వికారం లేకుండా ఉంటాడు. ఎందుచేతనంటే ఆయన నిర్వికారస్థితిలో ఉన్నాడు కాబట్టి ఆయనకు వికారం రాదు. మన శరీరం చనిపోయినప్పడు గురువుతో అనుబంధం తెగిపోదు, అది అలా కంటిన్యూ అవుతుంది. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మనం పొందేవరకు జన్మజన్మలకు మనలను వెంటాడతాడు. ఒకోసారి అలౌకికమైన ఆనందం వచ్చి మనలను ముంచేస్తూ ఉంటుంది, ఉక్కిరిబిక్కిరి అయిపోతాము. అది మన సాధనల వలన, మన తెలివితేటల వలన రావటం లేదు, గురువు అనుగ్రహం వలననే ఈ ఆనందాన్ని పొందుతున్నాము అని మనకు తెలుస్తూ ఉంటుంది. మానవతా సంబంధాలు అన్నీ నూటికి నూరుపాళ్ళు స్వార్థపూరితమైనవి. ఒక్క భగవంతుడితోటి మనకు ఉన్న సంబంధంలో స్వార్థంలేదు. ఈశ్వరుడితో మనకు ఉన్న అనుబంధమే నిజమైన ప్రేమ. అందుచేత చిల్లరచిల్లర గొడవలలోనికి వెళ్ళి మన మనస్సును పాడుచేసుకొనే బదులు ఈశ్వరుని దయను సంపాదించటానికి పనిచేస్తే ఆయన దయకు అన్నీ సాధ్యమే కాబట్టి మనకు ఆత్మజ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు. మనకు ఆత్మసుఖం దొరికే వరకూ మన మనస్సు విషయసుఖాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఆత్మసుఖం తెలిసాక ఇంక ఇటువైపు తిరగదు. నువ్వు బ్రాహ్మీస్థితి పొందావా ఈ ప్లానెట్‌లోనే కాదు, ఏ లోకంలో అయినా సరే నిన్ను ఆకర్షించే షాడో కనబడదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 09-11-08, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు సంబంధించినంతవరకు ఈ ప్రవచనాలు మనకు స్వధర్మం, ఈ సన్మానాలు అవి మనకు పరధర్మం. మన అతఃకరణ ప్రవృత్తికి అనుకూలమైన పనులు చెయ్యాలి. ఏదో మర్యాదలకోసం మన అంతఃకరణ ప్రవృత్తికి విరుద్ధమైన పనులు చేస్తే అది పరధర్మం. మనం

ఏదైనా పనిచేసేటప్పుడు ఎవరో చేస్తున్నారని ఆ పనులు చేయకూడదు. అది మన అంతఃకరణానికి అనుకూలంగా ఉందా, భవిష్యత్‌లో దీని పర్యవసానం ఎలా ఉంటుంది, దీని వలన మనకు శాంతి వస్తుందా అని ఇవి అన్నీ ఆలోచించుకొని పనులు చేస్తే అది స్వధర్మం. ఇలా కాకుండా ఎవరో చేస్తున్నారు అని మనం కూడా అవి చేయటం పరధర్మం అవుతుంది. పరధర్మం దుఃఖాన్ని ఇస్తుంది, స్వధర్మం సుఖాన్ని ఇస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మనం తరించాలి అంటే దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టేయాలి. మన దేహం ఎంత నిజమో ప్రారబ్ధం కూడా అంతే నిజం. దేహం ఏ రోజున పుట్టాలి, ఏ రోజున చనిపోవాలి అన్నది కూడా ప్రారబ్ధాన్ని బట్టే ఉంటుంది. ఇవన్నీ మనం పుస్తకాలలో చదువుతాము కాని మనకు నమ్మకం కుదరదు, మనం అదరం విశ్వాసహీనులం. లోకంలో అనేక విద్యలు ఉన్నాయి. ఆత్మవిద్య మాత్రమే సత్యవిద్య. దీనిని సత్యవిద్య అని ఎందుకు అన్నారు అంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని పట్టి ఇస్తుంది కాబట్టి దానిని సత్యవిద్య అన్నారు. ఆత్మవిద్యను నేను అని పరమాత్మ గీతలో చెప్పాడు. మిగతావి అన్నీ లోకానికి సంబంధించిన విద్యలు. నీ దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో ఆ విద్యలు కూడా అంతే నిజం. దేహాభిమానం ఉన్నవారు అందరూ పశువులే. శివుడు పశుపతి. పశుబుద్ధిని పోగొట్టేవాడే పశుపతి. వాడిని ఆశ్రయిస్తేనేకాని పశుబుద్ధి పోదు, పశుబుద్ధి పోతేగాని ఆత్మబుద్ధి కలుగదు.

మనకు భగవదనుభవం రాకుండా ఎవరో అడ్డువస్తున్నారు అని మనకు అనిపిస్తుంది. ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు. మన రూపబుద్ధి, నామబుద్ధే మనకు అడ్డు వస్తోంది. నేను ఆ మంచి పని చేసాను, ఈ మంచి పని చేసాను, అది సాధించాను, ఇది సాధించాను అని మనం ఎక్కువగా అనుకొంటూ ఉంటాము. ఈ అనుకోవటాలే మనకు అడ్డు వస్తున్నాయి. వీటిని ఊడగొట్టుకోవటం మానేసి మనం ఏదో పొందాలి, ఏదో పొందాలి అనుకొంటున్నాము. వీటిని ఊడగొట్టుకొంటేనేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. జపం చేద్దాము, ధ్యానం చేద్దాము ఏదో పొందేద్దాము అనుకొంటున్నాము కాని అసలు ఉన్నవి పోగొట్టుకోవటం మనకు చేతకావటం లేదు. అసలే మనం అప్పుతోటి ఉన్నాము, ఇంకా అప్పు పెంచుకోవాలి అని చూస్తున్నాము. మనం పోగొట్టుకోవలసినవి చాలా ఉన్నాయి. పోగొట్టుకోవలసినవి పోగొట్టుకొంటే ఉన్నది ఇక్కడే ఉంది. బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది, అది నీవై ఉన్నావు, నిన్ను నీవు ఏమి సంపాదించుకొంటావు. అది సంపాదించేది కాదు. దైనందిన జీవితంలో మన ప్రవర్తన బాగుంటే దానికి మన మీద దయకలిగి, మన పట్ల అనుగ్రహం చూపించి

ఏదో ఒకరోజున ఏదో క్షణాన నీకు ఎరుకలోనికి వస్తుంది, అది నీ కడసారి జన్మ. అది మీకు ఎరుకలోనికి వచ్చినప్పుడు ఒకచేయి రెండవచేయిని ముట్టుకొన్నప్పుడు ఆ స్పర్శ ఎలా తెలుస్తుందో అంత స్పష్టంగా ఆ వస్తువు తాలుక వైభవం నీకు తెలుస్తుంది, ఆ వస్తువు నీకు అనుభవంలోనికి రావటమే కాదు, అది నీవే అన్న సంగతి కూడా నీకు తెలుస్తుంది.

మనం వినేది నిజంకాదు, చూచేది నిజంకాదు, మనం ఆలోచించేది నిజంకాదు, మనం ఊహించేది నిజంకాదు. ఎందుచేతనంటే అసలు వస్తువు మనం చూడటానికి అతీతం, వినటానికి అతీతం, ఊహించటానికి అతీతం అది ఎవరో అనుకోవద్దు, అది మనమై ఉన్నాము. మనకు లోచూపు లేకుండా ఆ వస్తువు మనకు ఎరుకలోనికి రాదు. మీకు ఉన్న ధనాన్నిబట్టి అది బజారులో కొనుక్కొనేది కాదు. మీకు బాహ్యంగా ఎన్ని కోట్లు ఉన్నా వాటిని హృదయంలోనికి రానివ్వకూడదు. బయట గొడవలు అన్నీ బయటే ఉంచాలి, వాటిని లోపలకు రానివ్వకూడదు. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే బాగా కాలిన ఇనుము మీద మీరు నీటిబొట్టు వేస్తే ఆ నీటి బొట్టు నామరూపాలు లేకుండా కాలిపోతుంది. అలాగే విచారణ చేసి మీ నామరూపాలను పోగొట్టుకోవాలి. అర్జునా! నువ్వు ఏమనుకొంటున్నావు అంటే ఈ భీష్ముడిని చంపటం ఎలాగ, ద్రోణాచార్యులను చంపటం ఎలాగ అని నీవు అనుకొంటున్నావు, నువ్వు ఎవడవు చంపటానికి. నేను కాలరూపంలో ఉన్నాను. ఆ కాలం వచ్చేటప్పటికి వారి ప్రాణాలను పట్టుకొనిపోతాను. నువ్వు వూరికే చేతులు ఆడించు, అర్జునుడు జయించాడు అని లోకం చెప్పకొంటుంది. ఇది మనం చదువుతాము కాని ఎన్నిసార్లు చదివినా మనకు అర్థంకాదు. దీనికి కారణం మనకు ఈశ్వరుడిపట్ల ఉండవలసినంత విశ్వాసం లేదు. నోరు ఏమో భగవంతుడు ఉన్నాడని చెపుతుంది, మనస్సు లేడు అని చెపుతుంది. ఎందుచేతనంటే నీకు అర్హత లేదు, యోగ్యత లేదు, నీ మనస్సుకు ట్రైనింగ్ లేదు. మీరు భక్తులేగాని లోక విషయాలు విన్నంత శ్రద్ధగా భగవంతుడు చెప్పిన మాటలు వినరు.

లోకం అంటే ఏమీ లేదు, రూపాలు నామాలు క్రియ ఈ మూడు కలిపితే లోకం, ఈ మూడూ తీసేస్తే లోకం లేదు. మనకు ఈశ్వరుడిపట్ల ప్రేమ ఉండాలి, విశ్వాసం ఉండాలి, ఇవి మనకు లేవు. మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం, మంచిదే. అలాగే ఈశ్వరుడిపట్ల అంతప్రేమ మీకు ఉందా? ఆ ప్రశ్న మీరు వేసుకోవాలి. మీరు ఏదైనా మాట్లాడేటప్పడు అక్కడ హృదయం ఉండాలి. ఏదో జనరల్‌గా అందరూ మాట్లాడుతూ ఉంటారు. అక్కడ

మాట వేరుగా ఉంటుంది, వారి ఆలోచన వేరుగా ఉంటుంది, చేసేపని వేరుగా ఉంటుంది, అక్కడ హృదయం ఉండదు, అంటే త్రికరణశుద్ధి ఉండదు, సమన్వయం ఉండదు. లోకానికి సంబంధించిన గౌరవాలు సంపాదించాలని ఏదో లోపల ఉంటుంది. త్రికరణశుద్ధి లేనివాడికి ఎవడికీ జ్ఞానం రాదు. మీ స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం అని గీతలో పరమాత్మ చెప్పాడు. మీ స్వభావం మారాలంటే మీ మనస్సును, మీ దేహాభిమానాన్ని అగ్నిలో కాల్చాలి. మనం ఒక మాట మాట్లాడితే, చేతితో ఒకపని చేస్తే, మన మనస్సులో ఏదైనా ఆలోచన వస్తే అది ఇంపెర్సనల్‌గా ఉండాలి, అప్పుడు మనం పవిత్రులం అవుతాము, ఇది మనం జాగ్రత్తగా చూసుకోవాలి. మనం చేసే పని నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి. ఇతరులు మనలను గుర్తిస్తున్నారా లేదా అని మనం ఆలోచిస్తే మీకు కోటి జన్మలు ఎత్తినా జ్ఞానం రాదు. అజ్ఞానానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానానికి ఇతరులు లేరు. ఉన్నది ఒక్కటే, జ్ఞాని దానినే చూస్తూ ఉంటాడు, ఇంకవాడికి పేచీ ఏమి ఉంటుంది. రెండు కనిపిస్తూ ఉంటే భయం, కోరిక, అశాంతి, ద్వేషం అన్ని వికారాలు వస్తాయి. ఉన్నది ఒక్కటే అయినప్పుడు, లోకం అంతా తానే కనిపించినప్పుడు వాడికి వికారం ఏముంటుంది, ద్వేషం ఏముంటుంది. భయం ఏముంటుంది. శ్రద్ధ అంటే మన రాగద్వేషములను ఒక ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పిన మాట మీద నూటికి నూరుపాళ్ళు మనకు నమ్మకం కుదిరితే అది శ్రద్ధ. అటువంటి శ్రద్ధ మీకు కలిగితే అదే జ్ఞానానికి దారి చూపిస్తుంది. అటువంటి శ్రద్ధను మనం సంపాదించాలి, మిగిలినవి అన్నీ సెకండరీ, అన్నీ స్వప్నసమానమే. అందరి హృదయాలలో అంతర్యామిగా నేను ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు కదా, ఆ మాట మీద మనకు పూర్తి విశ్వాసం కుదిరితే నీకు మోక్షానికి ఎలిజిబిలిటీ వస్తుంది.

మీరు ఈశ్వరుడిపట్ల ప్రేమగా ఉండండి, భక్తిగా ఉండండి, ఏ సాధన చేయండి, వీటి అన్నింటి యొక్క గమ్యం ఒక్కటే, మనం పవిత్రులం అవ్వాలి. పరిశుద్ధుడు కానివాడు, పవిత్రుడు కానివాడు పరిపూర్ణత ఎలా పొందుతాడు అంటాడు ఏసు. అంటే పొందలేడు. ప్రారబ్ధాన్ని బట్టి శరీరానికి సంబంధించిన కష్టాలు ప్రతిజన్మలోను ఉంటాయి. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టి లోచూపు నేర్చుకొని లోపల ఉన్న సద్వస్తువును పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు హిమాలయాలకు వెళ్ళినా, కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా నీ పాడుమనస్సు నీ కూడా వస్తుంది, అది జ్ఞాపకం ఉంచుకోండి. దేహం ఎక్కడ ఉంటే ఏముంది, నువ్వు మారుమనస్సు పొందాలి, అది ముఖ్యం. భగవంతుడు మనకు బాగుపడే మాటలే చెపుతాడు కాని పాడయ్యే మాటలు

ఎందుకు చెపుతాడు, ఆయన మన దగ్గరనుండి ఆశించేది ఏమీలేదు. బంగారం చాలా గొప్పది అని మనం అనుకొంటాము, ఆయన దృష్టిలో అది మట్టితో సమానము. నీ హృదయంలో సద్వస్తువు ఉంది అని పెద్దలు చెపుతున్నారు. నాకు నమ్మకం ఉంది కాని అది గోరువెచ్చని నీళ్ళులాగ ఉంది, నాకు పూర్తి నమ్మకం ఎలా కలుగుతుంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీ మనస్సు ఇంకా పక్వానికి రాలేదు. తొందరపడవద్దు. మనం సాధన స్లోగా చేసుకొంటూ రావాలి. ఈ కాయను ఎప్పుడు తినేద్దామా అని పచ్చికాయను ముగ్గేస్తే అది కుళ్ళిపోతుంది, నోటిలోనికి వెళ్ళేబదులు పెంటమీదకు వెళ్ళిపోతుంది. మనం నెమ్మదిగా విశ్వాసం పెంచుకొంటూ రావాలి, సజ్జనసాంగత్యం చేస్తూ ఉండాలి. మనం బాగుపడుతాము, బాగుపడే రోజులు వస్తాయి అనే విశ్వాసం విడిచిపెట్టకూడదు. జరిగిపోయిన గొడవలు అన్నీ మర్చిపోయి నువ్వు విచారణ చేస్తూ ఉండు.

నీకు ఎంత చదువు ఉన్నా, డబ్బు ఉన్నా వాటిని ఇముడ్చుకోవాలి, సామాన్యంగానే కనబడాలి, ఎన్ని ఉన్నా వినయం విడిచిపెట్టకూడదు. వాటిని ఇముడ్చుకోలేకపోతున్నారు అనుకోండి, అస్తమాను కక్కేస్తున్నారు అనుకోండి, మీ స్వరూపానికి దూరమైపోతారు. ఈ డబ్బు, చదువు, కీర్తి మీ దేహప్రారబ్ధంలో ఉంటే వచ్చేస్తాయి, వాటిని ఎవరూ ఆపుచేయలేరు. ఇప్పుడు గాలి వీస్తోంది అనుకోండి, ఈ బిల్డింగ్‌లో ఉన్న జనం దగ్గరకు గాలి రాకూడదు అని నా చెయ్యి అడ్డుపెడితే ఆగుతుందా, ఆగదు. అలాగే మీ దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వచ్చేస్తుంది, మీ మీద అసూయ పడేవారు అడ్డుపెట్టినా ఆగదు. మా అబ్బాయికి సంబంధాలు వస్తున్నాయండి, ఊళ్ళోవాళ్ళు కొంతమంది చెడగొట్టేస్తున్నారు అని ఈ మధ్య ఒకరు నాతో చెప్పారు. నేను ఏమి చెప్పాను అంటే మీ అబ్బాయికి పెళ్ళి అయ్యే టైము వస్తే ఊళ్ళో వాళ్ళు అందరూ కలిసి చెడగొట్టినా పెళ్ళి ఆగదు. పెళ్ళి ఆపుచెయ్యటానికైనా, చెయ్యటానికైనా వాళ్ళు ఎవరు? భగవంతుడి సంకల్పం బలీయమైనది. ఎన్ని లక్షలమంది దానికి వ్యతిరేకంగా ఉన్నా అది జరిగిపోతుంది. అయితే భగవంతుడికి ఉన్న శక్తి మనకు తెలియకపోవటం వలన వాళ్ళు చెడగొట్టారు, వీళ్ళు చెడగొట్టారు అనుకొంటున్నాము. ఈశ్వరుడిపట్ల మనకు విశ్వాసం లేకపోవటంవలన ఇటువంటి సందేహాలు వచ్చి మనస్సును పాడుచేస్తాయి. దేనికి మనం కంగారుపడకూడదు. ఏది ఎప్పుడు జరగాలో అది అప్పుడు జరుగుతుంది.

ఆత్మజ్ఞానసముపార్జనకోసం శారీరకఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి, ఆరోగ్యమే ఆనందం. పూర్వపు విషయాలను గోడకట్టినట్లుగా మర్చిపో. వర్తమానకాలాన్ని సద్వినియోగం

చేసుకో. మీ ఇంట్లో ఒక గది చాలా సంవత్సరాలనుండి చీకటిగా ఉంది అనుకోండి. మీరు ఒక దీపం వెలిగిస్తారు అనుకోండి. చీకటి నేను పోను అని అంటుందా? మీరు దీపం వెలిగించగానే చీకటి పోతుంది. అలాగే భగవాన్ చెప్పేది ఏమిటి అంటే కొన్ని వేల జన్మలనుండి మీలోపల అజ్ఞానం ఉండవచ్చు. కాని మీరు విచారణ చేస్తే, ఈశ్వరుడిపట్ల విశ్వాసం పెంచుకొంటే మీ లోపల జ్ఞానదీపం వెలిగినప్పుడు అజ్ఞానం పటాపంచలైపోతుంది. అంతేగాని నేను వెయ్యిజన్మలనుండి నీ కూడా ఉన్నాను, ఇవాళ ఎక్కడికి పోతాను అని అనదు, అది అబద్ధం కాబట్టి వెంటనే పోతుంది. మనం నమ్మినా, నమ్మకపోయినా శాస్త్రం నిజం. అది నిజం అని నమ్మటానికే వందలాది సంవత్సరాలు తపస్సు చేయటం. శరీరం, మాట, మనస్సు అన్నీ తపోమయం అవ్వాలి. మనం వ్యక్తిభావనతో పనిచేయటానికి అలవాటుపడిపోయాము. మనం ఏమాటమాట్లాడినా, ఏ పని చేసినా వ్యక్తిభావన లేకుండా చెయ్యాలి. అసలు వ్యక్తి అక్కడలేడు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా తెలియకపోవటం వలన లేనివాడిని ఉన్నాడు అనుకొంటున్నాము. ఉన్నది ఉన్నట్లుగా మనకు తెలిసేవరకూ ప్రతిజన్మలోను ఇలా లేనిది ఉందని అనుకొంటూనే ఉంటాము.

అందరూ బాగున్నారు, సంసారం బాగుంది, రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అని అనుకొంటాము. మనందరము వలలో పడ్డ చేపలం అన్నారు రామకృష్ణుడు. వలలో పడ్డ చేపలు అనుకొంటాయట వలలో పడితేపడ్డాము, నీళ్ళు ఉన్నాయి, ఈదుతున్నాము, వలలో పడితే మనకు వచ్చే నష్టం ఏమిటి అని కేరింతలు కొడతాయి, కాని ఇంకో గంటలో దాకలోకి వెళ్లిపోతాము అని వాటికి తెలియదు. మనం కూడా అలాగే ఉన్నాము అన్నారు రామకృష్ణుడు. మాకు బాగా రోజులు వెళ్లిపోతున్నాయి అంటే ఏమి చూసి మనకు గర్వం? గర్వం పొందటానికి ఈ సృష్టిలో ఏముంది? నీ పని చాలా బాగా ఉన్నా అదీ స్వప్నమే, బాగా లేకపోయినా అదీ స్వప్నమే. యమధర్మరాజు దగ్గర నుండి పిలుపు ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు, ఆ పిలుపు వచ్చేవరకు అలా సంతోషంగానే ఉండండి, మీ సంతోషం నేను చెడగొట్టటం ఎందుకు అన్నారు. భగవంతుడు ప్రతి జన్మలోను మనకు ఏదో శరీరం ఇస్తాడు. ఆ శరీరమే మనం అనుకొని ఇలా తిరుగుతూ ఉంటాము. మనకు పుణ్యబలం లేకపోతే సత్పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధి కూడా మనకు కలుగదు. లోపల ఉన్న సత్యవస్తువును వదిలేసి అజ్ఞానం వెంటపడవద్దు. లోపల అజ్ఞానంలో ఉన్నప్పుడు, లోపల అవిద్యలో ఉన్నప్పుడు, లోపల బంధంలో ఉన్నప్పుడు వాడు డబ్బున్నా మూర్ఖుడే, వాడికి చదువు ఉన్నా మూర్ఖుడే. బయట డబ్బు

ఉంటుంది, చదువు ఉంటుంది కాని లోపల వాడి స్వభావం ఎక్కడికి పోతుంది. ప్రపంచంలో ఎవడు పనిచేసినా ఏదో కోరిక పెట్టుకొని చేస్తాడు, అలవాట్లను సంతృప్తిపరచుకోవటానికి పని చేస్తాడు, అలవాట్లకోసం డబ్బు సంపాదిస్తూ ఉంటాడు. సాధకులు తిండి దగ్గర, బట్ట దగ్గర జాగ్రత్తగా ఉండాలి. అర్హతకు మించి ఖరీదైన బట్టలు కొనకూడదు. మీకు అలవాట్లు లేవు అనుకోండి మీకు తిండికి, బట్టకు ఎంత అవుతుంది, పెద్ద ఎక్కువ ఏమీ అవ్వదు. అలవాట్ల వలననే డబ్బు పాడైపోతుంది. మీకు అలవాట్లయొక్క వేగం తగ్గితే లోపల సత్యవస్తువు ఉందో లేదో మీకే తెలుస్తుంది. సత్కర్మ, నిష్కామకర్మ భగవంతుడు ఎందుకు పెట్టాడు అంటే ఒకేసారి మనకు ధ్యానస్థితిరాదు.

మనస్సుకు నెమ్మదిగా నచ్చజెప్పి దాని మార్గాన్ని మార్చాలి, నరకానికి వెళ్లే మార్గం నుండి దానిని మోక్షం వైపుకు తిప్పాలి. ఇప్పుడు మీరు నిడదవోలు వెళ్లే రైలులో కూర్చొని భీమవరం రావటం లేదు అంటే భీమవరం ఎలా వస్తుంది. మీరు నరకానికి వెళ్లే మార్గంలో ఉండి మోక్షం ఎప్పుడు వస్తుంది అని కనిపెట్టుకొని ఉంటే, మోక్షం రానేరాదు. భీమవరం వెళ్లే రైలులో కూర్చొంటే ఒక గంట ఆలస్యం అయినా భీమవరం చేరుస్తుంది. అలాగే ముందు మీ గమ్యాన్ని నిర్ధారించుకొని మనస్సు ఆ వైపుగా ప్రయాణం చేసేటట్లు దానికి ట్రైనింగ్ ఇవ్వండి. మనస్సుకు నచ్చజెప్పి మోక్షం అనే రైలులో కూర్చోబెట్టండి. మనం అస్తమాను తలకాయతో ఆలోచిస్తున్నాము కాని హృదయంలో ఆలోచించటంలేదు. ఎంతసేపు మనకు తలకాయ గొడవే. నీ తలకాయలో ఉన్నానని భగవంతుడు చెప్పలేదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. కాలువలో నీరు ఎలా ప్రవహిస్తూ ఉంటుందో నా పట్ల మీ విశ్వాసం, మీ భక్తి, మీ ప్రేమ అలాగ నావైపు ప్రవహిస్తూ ఉంటే దానిని బట్టి మీరు బాగుపడటం అనేది సహజంగానే జరుగుతూ ఉంటుంది, మీకు తెలియ కుండా మీరు బాగుపడతారు. అప్పుడు లోపల ఉన్న శాంతి, ఆనందం ఉబికి ఉబికి మీ సహస్రారానికి అందుతుంది. మోక్షం ఎప్పుడో వస్తుంది, శాంతి ఎప్పుడో వస్తుంది అనుకొన్నాము అప్పుడే వచ్చేసింది ఏమిటి అని మిమ్మల్ని చూసిమీరే ఆశ్చర్యపడతారు. మనం ఈశ్వరుడిని స్మరించగా స్మరించగా అనాత్మకు దూరమవుతాము, మనం కాని విషయాలకు దూరమవు తాము. అగ్నిని సమీపించే కొలది వేడి ఎలా కలుగుతుందో అలాగ మనం అంతర్యామి అయిన పరమాత్మను సమీపించేకొలది నేచురల్‌గా, నార్మల్‌గా ఇంద్రియనిగ్రహం, మనో నిగ్రహం వచ్చేస్తాయి, దానికోసం ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. కొంతమంది ప్రతీదీ నెగిటివ్‌గా ఆలోచిస్తారు. వారు నెగిటివ్‌గా ఆలోచిస్తున్నారని మనం కూడా

నెగిటివ్‌గా ఆలోచిస్తే దానివలన మనం పాడైపోతాము, ఇవన్నీ సహవాసదోషాలు. మీరు డబ్బు సంపాదించుకోవటానికి అమెరికా ఎలా వెళుతున్నారో అలాగ సజ్జనసాంగత్యం కోసం భూమి యొక్క అంచులదాకా వెళ్లండి.

శ్రీకృష్ణచైతన్యుడి దగ్గర మస్తాన్ అని ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు. శ్రీకృష్ణ చైతన్య ఇంకో నాలుగు రోజులలో శరీరం విడిచిపెడతాడు అనగా ఆ భక్తుడితో మస్తాన్ నీవు నా కూడా తిరుగుతున్నావు, మతాలు వేరైనా నన్ను అవలంభిస్తున్నావు, నీకు ఏమి కావాలి మస్తాన్ అని శ్రీకృష్ణచైతన్య అడిగాడు. నాకేమి అక్కరలేదు, మీరు లేని ఈ లోకాన్ని నేను చూడలేను, మీరు ఉండగా నా శరీరాన్ని పంపేయండి అన్నాడు. అది వాడి విశ్వాసం. మస్తాన్ నీవు ఎంత పవిత్రుడవు అంటాడు శ్రీకృష్ణచైతన్య. నన్ను అప్పుడే పవిత్రుడిని అని అనకండి. నా ముక్కులో గాలి బయటకు పోయిన తరువాత మస్తాన్ పవిత్రంగా బతికాడు అని చెప్పండి. నా ముక్కులో గాలి ఉన్నంతసేపు ఏదైనా పొరపాట్లు చేస్తే చెయ్యవచ్చు, మాయ అంత బలీయమైనది అని చెప్పాడు. మీ చేతులతో నన్ను పంపేయండి అంటే అప్పుడు మస్తాన్‌కు శ్రీకృష్ణ చైతన్య ఆయన చేతులతో సమాధి చేసాడు. విశ్వాసం కనుక ఉంటే కొండలను కూడా కదపవచ్చు. అటువంటి విశ్వాసం ఎప్పుడు కలుగుతుంది అంటే భగవంతుడు చెప్పిన మాటలపై మనకు నూటికి నూరుపాళ్ళు నమ్మకం కుదిరితే విశ్వాసం వస్తుంది కాని నోటి మాటల వలన రాదు, ఆ స్పందన హృదయంలో నుండి రావాలి. అనవసరమైన గొడవలలోనికి వెళ్లిపోతే మీరు మాయలో చిక్కుకొనిపోతారు. మీరు బాగుపడే విధానం చూసుకోండి, నిరంతరం వాచింగ్‌లో ఉండండి. మీకు ఏవైనా చెడుతలంపులు వస్తున్నాయి అనుకోండి, చెడుతలంపులు వస్తున్నాయి, చెడుతలంపులు వస్తున్నాయి అంటే అవి పోవు. మంచి తలంపులు అలవాటు చేసుకొంటే చెడుతలంపులు పోతాయిగాని వూరికే పొమ్మంటే అవి పోవు. బుద్ధుడిది మోస్ట్ ఇంపెర్సనల్ లైఫ్. మీరు ఒక చిన్న మంచి పని చేసినా గుర్తింపులు కోరుకొంటారు. బుద్ధుడు ఒక మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టాడు. బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే బుద్ధుడు ఈ లోకంలోనికి వచ్చి వెళ్లిపోయాడు అనే గుర్తింపు కూడా అక్కరలేదు అని చెప్పాడు. బుద్ధుడు బుద్ధుడు అని మనం అనుకొంటాము. అక్కడ అసలు ఒక పెర్సన్ కనబడడు. అక్కడ ఎవడో ఒక వ్యక్తి ఉన్నాడని చూసేవారికి అనిపిస్తుంది కాని అక్కడ నో ఇండివిడ్యువల్ లైఫ్, అది యూనివర్సల్ లైఫ్. ఆయన మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్లిన తరువాత మరల దాని గురించి ఎప్పుడూ తలపెట్టలేదు. అక్కడ వైరాగ్యం నూటికి నూరుపాళ్ళు మనకు కనబడుతుంది.

ఎక్కడ ఎక్కడ ఎక్కడ ఎక్కడ

ఎక్కడ వెదకను కృష్ణా! నిన్ను

ఎక్కడ వెదకను కృష్ణా!

॥ ఎక్కడ ॥

చిక్క కుంటివిర కంటికి కృష్ణా

దిక్కులన్ని నే వెదకి చూచినా,

ఎక్కడ వెదకను, ఎలాగ వెదకను

చిక్కుల బెట్టకు కృష్ణా, నన్ను చిక్కుల బెట్టకు కృష్ణా!

॥ ఎక్కడ ॥

దాగుడు మూతలు చాలునులే ఇక

అగపడు కంటికి కృష్ణా, తగునా మాయలు కృష్ణా నీకిటు

తగునా మాయలు కృష్ణా!

॥ ఎక్కడ ॥

పగలూ రేయీ పొగిలే నా ఎద

సెగలు తాకవా కృష్ణా, నావగపు మాన్పవా కృష్ణా!

॥ ఎక్కడ ॥

**- డా॥ R.A. నాయక్**

ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా

ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా!

నిదురన్నది రానీయక, మదివేరే తలపు లేక

ఎదవాకిలి తెరచి యుంటి, కదలిరార శ్రీకృష్ణా!

॥ ఎదురు చూతురా ॥

నవనీత చోరుడవే, నవనీతము నా ఎదరా

అవలీలగ దొంగలింప అదను ఇదేరా కృష్ణా!

॥ ఎదురు చూతురా ॥

మురళీ ప్రియ మ్రోయింపుము, మురళి కదా నా హృదయము

కరగి, సురగి, ఈ జగమే పరవశించి పోవలెరా!

॥ ఎదురు చూతురా ॥

యమునా నది విహారింపుము, ఈ ఎదయే నౌకరా

కమలనయన శ్రీకృష్ణా, కాలుమోపి లోనికి రా!

ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చుతురా, నీకై

ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా!


– డా॥ R.A. నాయక్

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 9 | కాపవరం గీతాజయంతి |
| డిసెంబర్ 10 నుండి 15 వరకు | | అరుణాచలం క్యాంపు |
| డిసెంబర్ | 11 | అరుణాచలం దీపోత్సవం |
| డిసెంబర్ | 24 | గుండుగొలను |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



సద్గురు శ్రీ నాన్నగారు అక్టోబరు 16వ తేదిన

పాలకొల్లు మెయిన్‌రోడ్డులో అంబికా బంగారు ఆభరణముల

షాపు ప్రారంభించారు

# అవగాహన బట్టే - అనుభవం వస్తుంది

ఏదైతే అవగాహన చేసుకోబడదో దాన్ని అవగాహన చేసుకోవటానికి శాస్త్రం, గురువుల సూచనలను పరిశీలించాలి. శరీరం, ప్రాణం, బుద్ధి కానిది ఏదో అది నేను - శరీర మనోబుద్ధులు పరమాత్మచే పాలించబడుతోంది. అవి సత్యాత్మను పట్టుకోవేలవు; అవి జడ ప్రాయాలు, ఆత్మ వాటికి అతీతం. మనం పురుషునిగా, స్త్రీగా, దేవతగా ఆరాధిస్తున్నాము అనుకోండి మనం ప్రేమించేది శరీరాన్నా? కండరాలనా? ఎముకలనా? ముక్కునా? అందు నిజం లేదు. భోగాలు అనుభవిద్దాము అనుకొంటే రోగాలకు సిద్ధం కావాలి. మనం ఎంతెంత సత్య శోధన చేస్తామో అంతంతగా శీలం బలపడుతుంది. జ్ఞానమనే సూర్యకాంతిలోకి పోయేకొలది ఇంద్రియ వాసనలు కొవ్వత్తి కాలి నశించినట్లు నశిస్తాయి. పురుషుడిగా, స్త్రీగా, అందగానిగా, కురూపిగా, నిర్ధయునిగా, బలహీనునిగా, బలవంతునిగా కొత్త, కొత్త రూపాలు వరుసగా ధరించాలి. ఇవి వరుసగా ధరించే వస్త్రాలు. అన్ని రూపాల్లోనూ అహంకారం ఉంటుంది. ఆత్మానుభవంలో మనస్సు యొక్క వ్యాపారం ఆగిపోతుంది. మన కర్మానుగుణంగా ఈశ్వరుడు ప్రసాదించిన జీవితాన్ని కాదని నాకు ఈ సుఖం ప్రసాదించు, ఈ దుఃఖం నుంచి తప్పించు అని ప్రార్థిస్తే ఆయన ఎలా సాయం చేస్తాడు. వకంరగా ఉన్న పచ్చివెదురు కాల్చకుండా వంకర ఎలా పోతుంది. మన సంస్కారాలను రహితం చేయటానికి ఆయనే ఈ దుఃఖాన్ని ఏర్పాటు చేసాడు అనే అవగాహన రావాలి. అసలు ఈ మనస్సే ఈ కష్ట సుఖాలను మన చేత అనుభవింప చేస్తున్నది అని దాని మూలంలోకి వెళితే దాని అల్పత్వం అనుభవమౌతుంది. మన లక్ష్యం నిజ స్థితిని పొందటమే. భగవంతుడు మన అన్ని స్థితులకు ఆధారంగా ఉన్నాడనే విశ్వాసంతో ఆయనను ప్రేమించాలి. అందరూ "నేనే" అనే అవగాహన వస్తే ఇతరులను ప్రేమించకుండా ఎలా ఉ ండగలము. మహాత్ముల జీవిత చరిత్రల పరిశీలన ఒక అవగాహన ఇస్తుంది. అది స్ఫురణను, ప్రేరణను కలిగించి పరివర్తనను కలిగిస్తుంది. అది ఆ శక్తి, శ్రద్ధ, నిజాయితీలపై ఆధారపడి ఉంటుంది. బంధమంటే ఏమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న బుద్ధికి ముక్త స్థితి ఊహామాత్రంగానైనా అందుతుంది. ఒక చిన్న దీప కళిక కటిక చీకటిని పారద్రోలుతుంది. అలాగే అల్పబోధ కూడా మన అవిద్యను నాశనం చేస్తుంది. మన పరిస్థితులను మనమే సృష్టించుకొన్నాము. దేవుడు నిష్పక్షపాతి. కాని గురు అనుగ్రహంతో కర్మల వలయం నుంచి తేలికగా తప్పించుకోవచ్చును. "తానే తత్త్వమనుచు తలపోయలేక; మాయతత్వమనుచు మఱుగుచుండు; కర్మఫలము లేక కలుగునా తత్వంబు" అన్నారు వేమన. జీవితాన్ని ఒక పరీక్షగా సవాలుగా తీసుకోవాలి. ప్రపంచానికి దూరంగా వెళ్లటం మూర్ఖత్వం. ఏమీ సాధించలేము. శ్రీ నాన్నగారు "అద్దానికి ఎంత ప్రయోజనం ఉందో ఈ సృష్టికీ అంతే ప్రయోజనం ఉంది. ఈ సృష్టిలో ఎవరైనా నీపై నింద వేస్తే నీలో ఉన్న లోపంగా గ్రహించి తొలగించుకోవాలి. గ్రహణశక్తి ఉన్న వానికి దెబ్బలు తగలకుండానే జ్ఞానం కలుగుతుంది" అన్నారు. గురు అనుగ్రహం ఎక్కడ వర్షిస్తుందో అక్కడ చైతన్యం జాగృతమౌతుంది. దానికి గురుమూర్తిని ప్రేమించాలి అది ప్రధానం.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం